




# అపరాజిత

కీ.శే. నాగరాజు గంధం

**అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం** చేసి స్టాఫ్ రూంలోంచి బయటకొచ్చాను.

నెమ్మదిగా కాంపస్‌లో సందడి పెరుగుతోంది. ఫస్టవర్ మొదలవడానికింకా టైముంది.

నెమ్మదిగా ఆఫీసు రూముకేసి కదిలాను. గుమ్మం దగ్గరుండగానె లోపలి నుంచి పెద్దగా వినిపిస్తోంది సంభాషణ.

"చూడండి మేడమ్ ఈ 'కాలమ్' పూర్తి చెయ్యకుండా అప్లికేషన్ తీసుకోలేం" సెక్షన్ హెడ్ స్వామి కంఠం.

"అదే ఎందుకు తీసుకోరు? ఫాదర్ అన్న 'కాలమ్' కొట్టివేసి, మదర్ అని రాసి పూర్తి చెసి నేను సంతకం చేస్తున్నాను కదా!" అదే స్థాయిలో వినిపిస్తోందో కంఠం.

టక్కున ఆగాను. గొంతు ఎక్కడో విన్నదిలా అనిపించి అటు వైపు చూసి ఒక్కక్షణం అప్రతిభుణ్ణయి నిలిచిపోయాను. విభావరి.

అదే ఆవేశం, అదే వైఖరి.

"మేడమ్ పాప తండ్రి లేకుంటే గార్డియన్‌గా మీ పేరు రాయచ్చు. కానీ ఆయన బ్రతికే ఉన్నారంటున్నారుగా - అలాంటప్పుడు ఆయన పేరే రాయాలి. అని రూల్సు" ఈసారి కాస్త విసుగ్గానే అన్నాడు స్వామి.

"గోటు హెల్ విత్ యువర్ రూల్స్ పాప తల్లిని నేనిక్కడున్నాను. తండ్రి విషయం అప్రస్తుతం. పాపని చదివించేది నేను. అలాంటప్పుడు నేను సంతకం చేసివ్వడంలో మీ కభ్యంతరం ఏంటి?" ఆవేశంగా అంది విభావరి.

"సారీ మేడం. మీరోసారి ప్రిన్సిపల్‌ను చూడండి. మేమేమీ చేయలేం" అంటూ అప్లికేషన్ ఆమె వైపు జరిపాడు స్వామి.

విభావరి ఏదో అనబోయేంతలోనే అక్కడికి వెళ్ళి "స్వామీ అప్లికేషన్ తీసుకోండి" అన్నాను.

"కానీ సార్" అంటూ ఏదో చెప్పబొయ్యాడతను.

"పర్లేదు. నేను ప్రిన్సిపాల్‌తో మాట్లాడతాను" అన్నాను.

నేనెందుకు కల్పించుకున్నానో అర్థం కానీ స్వామి చిన్నగా గొణుక్కుంటూనే అప్లికేషన్ తీసుకున్నాడు.

నవ్వుతూ విభావరి వైపు చూశాను. "గుర్తుపట్టారా నన్ను?"

తనూ చిన్నగా నవ్వి "అహా ఇంకా మనుషుల్ని గుర్తు పట్టలేనంత వయసు రాలేదులే. వైకుంఠం చెప్పాడు. నువ్విక్కడ పనిచేస్తున్నావని ఈ అడ్మిషన్ అయ్యాక కలుద్దామని ఆగాను."

కించిత్తు ఆశ్చర్యంగా అడిగాను. "నేనిక్కడ పనిచేస్తున్న సంగతి నీకు తెలుసా? అయితే ముందుగా కలిస్తే సమస్య లేకపోవును కదా?"

"ఇప్పుడు మాత్రం ఏమైందని?" తేలికగా నవ్వేసింది విభావరి.

తనేం మారలేదు. ఆ స్వభావంలో మార్పు లేదు. కాకపోతే రూపంలోనే కాస్త తేడా. విద్యార్థినిగా ఆ రోజుల్లో ఓణీల్లో పరిచయమైన విభావరి - చీరల్లోకి మారి మధ్య వయసు హుందాతనం తెచ్చుకుంది.

"అప్లికేషను తతంగం పూర్తి అయి ప్రిన్సిపల్ దగ్గరకు వెళ్ళేపాటికి ఆలస్యమవుతుంది. ఈలోగా అలా కాంటిన్ వరకూ వెడదాం" అంటూ బయటకి దారి తీశాను. నా ప్రయత్నం లేకుండానే నా చూపులు క్షనకాలం విభావరి మెడకేసి నిశితంగా పరికిస్తూ ఉండిపోయాయి.

"ఏంటి, అంత పరీక్షగా చూస్తున్నావ్? పెళ్లైందా, లేదా అనా. ఇంకా చేసుకోలా" నా మనసులో ఆలోచన చదివినట్టు చెప్పింది.

ఒక్క క్షణం తొట్రుపడి నవ్వేశాను. "నువ్వేం మారలేదు విభావరీ. ముఖ్యంగా కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడే నీ స్వభావం అస్సలు మారలేదు.

"అదిక మారేది కూడా కాదు గానీ నా గురించి ఏమీ తెలీదు కదూ! నీకు నిన్ననే కాకినాడ నుంచి బదిలి అయి వచ్చి ఉమెన్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఇక్కడ చేరాను, నిన్న సాయంత్రం వరకూ ఇల్లు వెతుక్కోవటం తోనే సరిపోయింది. ఈరోజు పాపను కాలేజీలో చేర్పించే కార్యక్రమం" అంటూ ఒక్కసారి వాచీ చూసుకుని అరె. పదకొండవుతుంది" అంది.

"ఏం పనేమన్నా ఉందా?" అన్నాను.

కలెక్టర్‌తో ఓ మీటింగ్ ఉంది. వెళ్ళాలి. పోనీ, పార్థూ, శ్రమ ఇస్తున్నాను అనుకోకుంటే - కాస్త పాప అడ్మిషన్ సంగతి చూస్తావా?" అడిగింది.

"తప్పకుండా. ఇంతకూ పాపేది?"

"అదిగో అక్కడ" అంటూ స్కూటర్ స్టాండ్ వైపు చూపింది. అక్కడో తెల్లటి కెనటిక్ హోండా స్కూటర్ పక్క చేతిలో పుస్తకాలతో కనిపించిందొక అమ్మాయి - చూడగానే తెలిసిపోతోంది విభావరి కూతురేనని. అంతగా కనిపిస్తున్నాయి పోలికలు. పదహారేళ్ళుంటాయి అనిపించింది. అవును పదహారేళ్ళుండాలి.

"అడ్మిషన్ దొరికిందామ్మా?" మమ్మల్ని చూస్తూనే ఆత్రంగా ఎదురొచ్చి ప్రశ్నించింది.

"ఆ దొరికినట్లే. బైదిబై వీరు పార్థు అంకుల్ ప్లస్ మీ కాలేజీ లెక్చరర్ కూడా" అంటూ నాకేసి తిరిగి "పార్థూ ఈమె అభయ నా ఇంటర్ బైపిసి విద్యార్థిని" పరిచయం చేసింది విభావరి.

అభయ విభావరి తన స్వభావానికే అనుగుణమైన పేరే పెట్టుకుంది అనుకున్నాను.

"సరే సాయంత్రం వచ్చి కలుస్తాను. తీరిగ్గా మాట్లాడుకుందాం" అంటూ స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయింది విభావరి.

ప్రిన్సిపాల్‌తో మాట్లాడి ఫీజు కట్టి, అభయను తన క్లాస్ రూములో కూర్చోబెట్టి తిరిగి స్టాఫ్ రూములో కొచ్చాను. విభావరి గురించిన ఆలోచనలు చిన్నగా మొదలవ్వగా - ఏదో జ్ఞాపకాల ముసురు ఒక్కసారిగా నన్నావరించింది. గతం కళ్ళముందు కదిలింది.

మొదటిసారిగా విభావరి పేరు వైకుంఠం నోటిగుండా విన్నాను. అదీ చాలా చిత్రంగా.

"ఈ రోజు విభావరిని సాధించి తీరుతాను" అన్నాడు వైకుంఠం.

అప్పటికి వైకుంఠంతో నా పరిచయం రెండురోజులదే ఏలూరులో ఉద్యోగం చేస్తున్న నాన్నగారికి అనుకోకుండా ఫిరంగిపురం బదిలీ కావడంతో బి.ఏ మొదటి సంవత్సరం ఏలూరులో చదువుతున్న నేను ఫిరంగిపురానికి దగ్గరలో ఉన్న గుంటూరులో చేరిపోయాను. కాలేజీలో చేరిన మొదటి రోజే క్లాసులో పరిచయమయ్యాడు వైకుంఠం. అతని చొరవ అతనితో పరిచయమైన మరునాడే అతని

రూమ్మేటుగా చేరిపోయేలా చేసింది. అప్పటికి విభావరి పేరు అనేక మార్లు అతని నోటివెంట విన్నా.. ఎవరూ, ఏమిటి అని అడగలేదు నేను. కానీ ఆ పేరు అంతకుముదెన్నడూ వినుండక పోవడం వల్ల కాబోలు ఆ పేరు చిత్రంగా నా కలా గుర్తుండిపోయింది.

నేను కాలేజీలో చేరిన వారం రోజులకే కాలేజీ తరపున పికినిక్ ఏర్పాటయింది. వైకుంఠం ప్రోత్సాహం మీదే నేనూ కలిశాను ఆ పిక్‌నిక్‌లో. రెండు బస్సులలో కృష్ణపట్నం డామ్ చేరాం.

కృష్ణానదిలో కలిసిపోయే ఓ ఉపనదికి ఆనకట్ట కట్టారక్కడ. ఎంతో రమణీయమైన ప్రకృతి దృశ్యాలు. ఆ నదీ తీరాన్ని ఆనుకుని ఎప్పటిదో ఓ గుడి, దాన్నంటిపెట్టుకుని ఓ పెద్ద మర్రిచెట్టు ఆ చెట్టుకొమ్మలు విశాలంగా వ్యాపించి, పరవళ్ళు తొక్కుతున్న ఆ నదీ ప్రవాహం పైకి విస్తరించి ఉన్నాయి. మధ్యాహ్నం వరకూ అంతా ఆ చుట్టుపక్కల ఉన్న మామిడి అరటి తోటల్లో తిరుగుతూ ఫోటోలు తీసుకుంటూ గడిపేశారు. భోజనాలకు డామ్ గెస్ట్ హౌస్ చేరబోతుండగా, ఎవరో "వైకుంఠం గుడి దగ్గర ఉన్న చెట్టుకొమ్మ చివర నుంచినదిలోకి దూకేస్తానంటున్నాడు" అంటూ సంచలనమైన వార్త అందించారు.

ఒక్కసారిగా అందరం అక్కడికి చేరాం. అప్పటికే అక్కడంతా జనం. వాళ్ళంతా దూకద్దని బ్రతిమాలుతున్నారు.

"ఎందుకట?" ప్రశ్నించారెవ్వరో.

"వచ్చే వారం మొదలయ్యే కాలేజి షటిల్ మిక్సెడ్ డబుల్ పోటీల్లో - విభావరి తనతో కలిసి ఆడతానని మాటివ్వాలట."

నాకు ఒకింత అయోమయంగా, మరికాస్త చిత్రంగా అనిపించింది.

"అలాగే విభావరిని ఒప్పిస్తాం. ముందు నువ్వు దిగిరా" అన్నారు మా పికినిక్ పార్టీలోనే ఉన్న ఫిజికల్ డైరెక్టర్.

"అలా అని విభావరి మీ అందర ముందు ఇప్పుడే చెప్పాలి లేకపోతే దూకేస్తాను" అంటూ వైకుంఠం తానున్న కొమ్మకు మరికొంత చివరకు చేరాడు.

ఇదేదో అర్థంలేని డిమాండ్‌లా అనిపించింది నాకు.

అంతలో ఎవరో "విభావరిని పిలిపించండి" అన్నారు.

అప్పుడు చూశాను విభావరిని మొదటిసారిగా. కోల ముఖం, పెద్ద బొట్టూ ఛామనఛాయలో సాధారణమైన బట్టల్లో ఎంతో మాలులుగా ఉంది. కానీ ఎక్కడో ఏదో తెలీని ఆకర్షణ - ఒక్కసారి చూస్తే మళ్ళీ చూడాలనిపించే గమ్మత్తయిన ఆకర్షణ. అందరూ అడిగారామెను వైకుంఠాన్ని దిగిరమ్మని చెప్పమని.

"నాన్సెన్స్ నే చెప్ప"నంది విభావరి.

చాలా మంది లెక్చరర్లు నచ్చచెప్పారామెకి. నిమిష నిమిషానికీ గుంపు పెరుగుతోంది. కొందరు కుర్రాళ్ళు చాలా ఆవేశపడ్డారు. ఎలా చెప్పదో చూస్తామన్నారు.

చలించలేదు విభావరి - "అతను దూకినా సరే, చెప్ప"నంది.

ఎందుకో నాకు చిత్రంగాను, చిరాగ్గాను అనిపించిందామె పట్టుదల. ఈలోగా వైకుంఠం పది నిమిషాలు వ్యవధి ఇచ్చాడు. కుర్రాళ్ళతో ఉద్రిక్తత పెరిగింది.

"చూడమ్మా ఒక్కసారి అతనడిగినట్టు చెప్పి కిందకి దింపు. ఆ తరువాత ప్రిన్సిపాల్ గారి చేత సివియర్ పనిష్మెంట్ ఇప్పిద్దాం" అన్నారు పొలిటిక్స్ లెక్చరర్.

"సారీ సార్. ఎటువంటి పరిస్థితిలోనూ అలా చెప్పను" ఖరాఖండిగా చెప్పిందామె.

"కనీసం జాలితోనైనా కిందకి పిలవచ్చుకదా? అన్నారెవరో.

"ఎవరి మీద జాలిపడాలి. అతనలా చెట్టెక్కి నన్నల్లరిపెడుతుంటే మీరందరూ అతని మీద సానుభూతి చూపిస్తారేంటి? ఈ రోజు తనతో కలిసి గేమ్ ఆడమని చెట్టెక్కాడు - రేపు సినిమాకి రమ్మని రైలుపట్టాల మీద పడుకుంటాడు. ఒక బ్లాక్ మెయిలర్‌ని చూసి జాలిపడేంత సహృదయత నాకులేదు" చాలా దృఢంగా అంది విభావరి.

"మరతను అక్కడినుంచి దూకితే ఎవరిది బాధ్యత?" విసుగ్గా అన్నాడు ఫిజికల్ డైరెక్టర్.

ఒక్కసారి చెట్టు మీదున్న వైకుంఠాన్ని చూసి "అతను దూకడు" - అంటూ తాపీగా చెప్పి వెళ్ళిపోయింది విభావరి.

ఆ పదినిమిషాల తర్వాత మరో అరగంట వ్యవధి ఇచ్చాడు వైకుంఠం. ఆ తర్వాత గంట ఇలా పెంచుకుంటూ పోయి సాయంత్రానికి చాలా జాగ్రత్తగా తనే దిగాడు.

ఆ రోజు నా ఆలోచనల్లో చాలా సేపు చోటు చేసుకుంది విభావరి. ముఖ్యంగా ఆ తెగువ, ధైర్యం - తను నమ్మిన విషయాన్ని సూటిగా చెప్పే తత్వం.

కానీ వైకుంఠం వైఖరే నాకు చాలా చిత్రంగా అనిపించింది.

"విభావరి ఒప్పుకోకపోడనే మంచిదయింది. ఆమె కొట్టే షాట్స్ అన్నీ కోర్టవతల పడతాయి" అన్నాడు వైకుంఠం నాతో మర్నాడు.

ఆ పోటీల్లో విభావరి కలేజి క్రికెట్ టీమ్ కాప్టెన్ ప్రదీప్ తో కలిసి జతగా ఆడి, మిక్సెడ్ డబుల్స్ టైటిల్స్ గెలుచుకుంది.

అలా మొదటిసారి చూడ్డంతోనే మంచి అభిప్రాయం ఏర్పడిపోయింది నాకు విభావరి మీద. ఆ తరువాత రెండు నెలలకి తనతో పరిచయమైంది. అదీ చాలా కాకతాళీయంగా కాలేజి డిబేటింగ్ పోటీల్లో చలం సాహిత్యం మీద మాట్లాడాను నేను. మాట్లాడి కిందకి దిగుతుండగానే.

"కంగ్రాట్స్. చాలా బాగా మట్లాడారు" అంటూ అభినందించింది విభావరి.

"థాంక్స్" అన్నాను.

"అసలు నేను కూడా ఇందులో పార్టిసిపెంట్‌నే. కానీ మీరు మాట్లాడాక నేను మాట్లాడటానికి మరేం లేదనిపించింది. మానేస్తున్నాను"

ఎందుకో ఒక్క క్షణం చాలా గర్వంగా అనిపించింది. బహుమతి కూడా నాకే వచ్చింది. ఫంక్షన్ అయ్యాక తిరిగి వెళ్ళేటప్పుడు అడిగింది విభావరి. "ఇంతకీ మీరెక్కడుంటున్నారు?" అంటూ.

"అరండల్ పేట" అని మాత్రం చెప్పాను.

ఆ తరువాత కాలేజీలోనే కనిపించినప్పుడల్లా పలకరించేది విభావరి. కొద్దిరోజుల్లోనే నాకున్న అతి కొద్ది మంది మంచి స్నేహితుల్లో ఒకటైపోయిందామె. కొత్తల్లో ఒకటి రెండుసార్లు వైకుంఠం నా రూమ్మేటని చెప్దామనుకుని సందిగ్ధంగా ఆగిపోయాను. అలా అని తెలిస్తే తన స్పందన ఎలా ఉంటుందోనని ఓసారి మాటల సందర్భంలో చెప్పేశాను వైకుంఠం నా రూమ్మేటని. నేననుకున్నట్టు విభావరిలో ఎటువంటి రియాక్షన్ లేదు. చాలా మామూలుగా "అలాగా?" అనిఊరుకుంది.

ఇలా ఉండగా ఓ రోజు వైకుంఠం నాతో "నీకు తెలుసా గురూ? విభావరి ప్రదీప్ గాడితో తిరుగుతోందిప్పుడు" అన్నాడు 'ఇప్పుడు' అనే పదాన్ని నొక్కి పలుకుతూ.

వైకుంఠం నా కాపాటికి చాలా అర్ధమయ్యాడు. అందువల్లే నేనేం మాట్లాడలేదు. మృదువుగా నవ్వి ఊరుకున్నాను. అయితే ఆ ఉదంతం వైకుంఠం నోటితోనే ఆగలేదు. చాలామంది అన్నారు నా దగ్గర. విభావరి దగ్గర నేనేమీ ప్రస్తావించ దలుచుకోలేదు. ఏదైనా ఉంటే తనే చెబుతుంది అన్నట్టుగా ఊరుకున్నాను.

అలాగే అయింది. ఓ రోజు ప్రదీప్‌ను పరిచయం చేస్తూ "మా గురించి చాలా వినే ఉంటావు పార్థూ" అంటూ నవ్వింది.

నిజంగా చాలా ఇబ్బందిపడిపోయ్యాను. "అటువంటివి పట్టించుకోనుగా" అన్నాను.

పరిచయం చెయ్యటమయ్యాక తనకేదో పనున్నదంటూ విభావరి వెళ్ళిపోయింది. నేను, ప్రదీప్ ఇద్దరమే మిగిలాం.

"మీకు విభావరి చిన్ననాటి నుంచి తెలుసా?" హఠాత్తుగా ప్రశ్నించాడు ప్రదీప్.

"లేదే ఏం?" అన్నాడు.

"అహ. ఏం లేదు. మీరు, తను ఒక ఊరి వాళ్ళేనని, చిన్నప్పటి నుంచి కలిసి మెలిసి తిరిగేవారని చెబితేనూ"

"మీతో ఎవరు చెప్పింది" ఆశ్చర్యంగా అడిగాను.

"మీ రూమ్మేట్ వైకుంఠం"

ఆ మర్నాడే రూము ఖాళీచేసి మరోచోట చేరిపొయ్యాను.

రోజు రోజుకీ కాలేజీలో విభావరి - ప్రదీప్‌ల విషయం మీద గొడవ ఎక్కువైంది. ఎవరో గోడల మీదకూడా రాశారు వాళ్ళిద్దరి పేర్లూ. నే మౌనంగా గమనించటం తప్ప మరేం చెయ్యలేకపొయ్యాను.

సరిగ్గా ఆ సమయంలోనే 'నాన్నగారు సీరియస్' అంటూ టెలిగ్రాం వచ్చింది. హడావుడిగా వెళ్ళిపోయాను. నే వెళ్ళేసరికి నాన్నగారి శవం మాత్రమే చూడగలిగాను. ఆషాక్ నుంచి తేరుకునేసరికి నెలరోజులు గడిచాయి. నాన్నగారి ప్రావిడెంటు ఫండు, గ్రాట్యుటీలతో అప్పులు తీరాయి. అమ్మ, ఇద్దరు చెల్లెళ్ళు బాధ్యతలుగా కళ్ళముందు మిగిలారు. ఆ పరిస్థితులలో అక్కడ చదువు కొనసాగించడం అసాధ్యమనిపించింది. అమ్మకూడా 'కాకినాడలో ఉన్న మామయ్య దగ్గరికి వెళ్ళిపోదా'మంది. కాలేజ్‌కి వచ్చి టీ.సీ.కి అప్లయ్ చేశాను. మిత్రులందరి దగ్గరా సెలవు తీసుకున్నాను. కానీ విభావరి కనిపించలేదు. అసలేమైందో కూడా తెలీదు.

బయలుదేరబోతుండగా వైకుంఠం కలిశాడు. "తెలుసా గురూ విభావరి వాళ్ళ మదర్ పొయ్యారు" అంటూ. ఒక్కసారిగా షాక్ అయ్యాను. చాలాసార్లు చెబుతుండేది విభావరి - "మా అమ్మ జీవితమంతా నా కోసమే కష్టపడింది. పార్థూ ఈ చదువు అ య్యాక అమ్మని కాలుకింద పెట్టనివ్వనంతగా సుఖపెట్టాలి" చిన్నప్పుడే తండ్రిని కోల్పోయిన ఆమెకి తల్లిమీద అంత ఆపేక్ష.

"మరేమౌతుందిగురూ? ప్రదీప్ గాడితో తిరిగినన్నాళ్ళూ తిరిగింది, కడుపొచ్చింది. వాడు పరార్. ఈమేవన్నా ఆ కడుపు తీయించుకోనని కూర్చుందిట. ముసలావిడ చెప్పి చెప్పీ హరీమంది"

"ఏదో చెబుతున్నాడు వైకుంఠం. అవేవీ చెవికెక్కటం లేదు. మనసంతా మొద్దుబారిపోయినట్టయింది. ఇంటికెడదామనుకున్న మనసు మార్చుకుని వైకుంఠం దగ్గర అడ్రస్ తీసుకుని విభావరి కోసం బయలుదేరాను. అప్పటికే విభావరి ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోయినట్టుగా చెప్పారు ఇంటివాళ్ళు. ఎక్కడి కెళ్ళిందో చెప్పలేక పొయ్యారు. నిరాశగా వెనుతిరిగాను. అంతరాల్లో తనని కలవలేక పొయ్యానే అని బాధపడుతూ. అయితే నన్నాశ్చర్యపరుస్తూ స్టేషన్‌లో కలిసింది రైలు మరో కొద్దిసేపటిలో బయలుదేరుతుందనగా. ఎందుకో చాలా మారిపోయినట్టనిపించింది - ఒక్కసారిగా పదేళ్ళు పెద్దదయినట్టు. ఎంతో అనుభవం సంపాదించినట్టు. కష్టాలు మనిషిలో పరిపక్వతని చాల త్వరగా బయట పెడతాయేమో అనిపించింది ఆ క్షణం. ఇద్దరి మధ్యా కొన్ని క్షణాలు మౌనంగా దొర్లిపొయ్యాయి. ముందుగా విభావరే అంది "జీవితంలో మలుపులు చాలా చిత్రంగా ఉంటాయి కదు?" మాట్లాడలేదు నేను. ఏం మాట్లాడాలో తెలీలేదు. విభావరిని చూస్తూ ఉండిపోయాను.

"అమ్మపోయింది" ఆమె స్వరం వణికింది.

"తెలిసింది. వైకుంఠం చెప్పాడు. మీ ఇంటికి వెళ్ళాను. ఇల్లు ఖాళీచేశావని చెప్పారు"

"అవును పార్థూ. ఊహ తెలిసినప్పటినుంది అమ్మతో గడిపిన ఆ ఇంట్లో ఉండలేకపొయ్యాను" ఆమె గొంతు జీరబోయింది. మరుక్షణం తేరుకుని "ఏకాకిని కదా. హాస్టల్లో చేరాను. వైకుంఠమే చెప్పాడు నువ్వొచ్చిన సంగతి"

"మరి ప్రదీప్" ఏదో అడగబొయ్యాను.

నా మాట  పూర్తికానివ్వలేదామె. "ప్రదీప్‌కి పెళ్ళయిపోయింది" చాలా మామూలుగా చెప్పింది.

ఒక్క క్షణం చిత్తరువులా ఉండిపొయ్యాను.

"మరి నువ్వెలా ఊరుకున్నావ్?"

"ఏం చెయ్యమంటావ్? ఈ అబ్బాయితో సినిమాలకీ, షికార్లకీ తిరిగాను. కనక ఈ అబ్బాయి నన్ను చేసుకోవాల్సిందే అని గొడవ చెయ్యమంటావా?"

"అదికాదు విభావరీ" అంటూ ఏదో చెప్పబొయ్యాను.

"చూడు పార్థూ. ఇద్దరం ప్రేమించుకున్నాం. పెళ్ళికూడా చేసుకుందామనుకున్నాం. మధ్యలో అతను నిర్ణయం మార్చుకున్నాడు. పిరికి వాడే అయ్యాడో ప్రలోభ పడ్డాడో. నాకు తెలీదు. అతను నన్ను వద్దు అనుకున్నప్పుడు నేనతన్ని కావాలి అనుకుని ఏం లాభం చెప్పు? జీవితంలో అదో మూతపడ్డ అధ్యాయం. అతన్ని పూర్తిగా మరిచిపొయ్యాను."

ఆశ్చర్యంలో అవాక్కై పొయ్యాను ఆ నిబ్బరానికి.

గార్డు విజిల్ వేశాడు.

"ఏం చేద్దామనుకుంటున్నావ్. విభావరీ?" అని ప్రశ్నించాను.

"బ్రతుకుదామనే అనుకుంటున్నాను" చిత్రంగా ధ్వనించిందామె గొంతు.

చటుక్కున తలెత్తి చూశాను. విభావరి కళ్ళలో అస్పష్టంగా కనిపిస్తున్న తడి.

"అవును. ఈ లోకంలో ఒంటరిగానైనా స రే ధైర్యంగా బ్రతుకుదామనుకుంటున్నాను. నా కోసం, నా కడుపులో పెరిగే బిడ్డ కోసం బ్రతుకుదామనుకుంటున్నాను" స్థిరంగా పలికిందామె కంఠం.

అప్రయత్నంగా నా కనులు చెమర్చాయి. రైలు కూత వేసి బయలుదేరింది.

ఏదో చెప్పాలని ప్రయత్నించాను. గొంతు పెగల్లేదు. అలా మౌనంగానే బండి ఎక్కాను. రైలు అందుకున్న వేగంతో విభావరి రూపం మసక మసకగా అదృశ్యమైంది.

తర్వాత జీవితం ఎన్నో మార్పులకి లోనైంది. మామయ్య సాయంతో చేరిన ఉద్యోగం చేస్తూనే ప్రవేటుగా ఎం.ఏ పూర్తి చేశాను. ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళూ జరిగిపొయ్యాయి. రెండో చెల్లెలి పెళ్ళి జరిగిన పదిరోజులకే అమ్మ ఈ లోకాన్నే  విడిచి వెళ్ళిపోయింది. అమ్మ మరణం జీవితంలో ఎంతో నైరాశ్యాన్ని మిగిల్చింది. దాన్ని ఒంటరితనంతోనే సమాధానపెడుతూ వచ్చాను. సరిగ్గా అలాంటి సమయంలోనే చిత్రంగా విభావరి గుర్తొచ్చేది. ఎక్కడ ఉందో? ఎలా ఉందో?

పెళ్ళిచేసుకుందామన్న ఆలోచన ఎప్పుడన్నా క్షణకాలం మనసులో మెదిలినా ఎవరిని అన్న ప్రశ్న దగ్గర ఆ విషయం జవాబు లేకుండా ఆగిపొయ్యేది. కానీ అంతరాల్లో ఏదో అస్పష్టత. దేనికోసమో వెతుకులాట. ఇలా నా మనసుని నే అర్థం చేసుకునే ప్రయత్నంలో ఉండగానే పెళ్ళి చేసుకోవలసిన వయసు దాటిపోయింది జీవితంలో లెక్చరరుగా స్థిరపడిపొయ్యాను.

విభావరి గురించి ఎప్పుడన్నా వైకుంఠం కలిస్తే చెబుతుండేవాడు. అలా పరోక్షంగా కలుస్తున్నా విభావరి ప్రత్యక్షంగా కలిసింది ఈనాడే ఇన్నాళ్ళకి ఇప్పుడే

"అంకుల్ అమ్మ వచ్చింది" అంటూ అభయ రావడంతో జ్ఞాపకాల నుంచి బయటపడ్డాను.

బాగా అలసిపోయినట్లు కనిపించింది విభావరి.

"అబ్బ. ఏంటి బాబూ మీ ఊళ్ళో ఇన్ని 'వన్‌వే'లు. ఆఫీసునుంచి ఇక్కడికి రావడానికి దేశమంతా తిరిగి రావలసి వచ్చింది" అంది.

"అభయ అడ్మిషన్ అయింది"

"ఏదైనా అభ్యంతరం చెప్పారా?"

లేదన్నట్టుగా తలూపాను. ముగ్గురం బయటకు దారి తీశాం.

"అమ్మా నువ్వూ, అంకుల్ నడుస్తూ రండి. ఈ రోజు స్కూటర్ నే నడుపుతాను" అంది అభయ.

"వద్దు. ఇక్కడ చాలా ట్రాఫిక్ రూల్స్. నీకు లైసెన్స్ కూడా లేదు కదా!" వారించింది విభావరి.

"ప్లీజ్ అమ్మా ఇక్కడినుంచి దగ్గరే కదా. ఇలా నువ్వు ఎప్పుడూ వద్దంటుంటే ఇంక నా కెప్పటికీ డ్రైవింగ్ రాదు - ప్లీజ్" అంది అభయ.

చిన్నగా నవ్వుతూ అంది విభావరి. "ఓ.కే. కానీ నేనూ, అంకుల్ ఇంటికొచ్చేసరికి నువ్వు మాకు మంచి కాఫీ చేసుంచాలి"

అభయ ఒక్కసారిగా ఎగిరి గంతేసినంతపని చేసి - నా వైపు తిరిగి, "అంకుల్ కాస్త నెమ్మదిగా రండి. మీకోసం మంచి కాఫీ ఉంటుంది" అంటూ స్కూటర్ స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయింది.

"ఇంకా అల్లరి తగ్గలేదు" అంది విభావరి.

"అది అల్లరికాదు. చలాకీతనం. మరో రకంగా చెప్పాలంటే ఈ ప్రపంచంలో బ్రతకటానికి ఆయుత్తం కావడం. అన్నీ నీ పోలికలే" అన్నాను. సమాధానంగా చిన్నగా నవ్వింది విభావరి.

సాయంత్రపు నీరెండ పల్చగా పరచుకుంటోంది. కాలేజీ గ్రౌండ్ మధ్యలోంచి అడ్డదారి గుండా నడుస్తున్నం. ఎన్నో సంవత్సరాల తర్వాత కలసిన విభావరితో ఏం మాట్లాడాలో అర్థం కావటం లేదు. మౌనంగా ఉండిపొయ్యాను.

ముందుగా విభావరే అంది.

"నువు పెళ్ళెందుకు చేసుకోలేదు పార్థూ?"

జవాబు లేని ప్రశ్న అది.

చిన్నగా నవ్వాను. "ఏమో ఎందుకో తెలీదు బహుశా ఎవరిని చేసుకోవాలో తెలీక కాబోలు అన్నాను.

"కాదనుకుంటాను. నాలాంటి వాళ్ళ జీవితాలు చూసి జడుసుకునుంటావ్" గమ్మత్తుగా నవ్వింది. మళ్ళీ తనే అంది. "మరి నేనెందుకు చేసుకోలేదో తెలుసా?"

మౌనంగా చూశానామెవైపు.

"నీ మొహం నీకు పెళ్ళేమిటి అనుకుంటున్నావా? కానీ పెళ్ళిచేసుకుంటానికి ఎన్నో అవకాశాలొచ్చాయి నాకు. భార్యలు పోయినవాళ్ళూ - విదేశాలలో స్థిరపడ్డ వాళ్ళూ, జీవితంలో పెళ్ళి అవసరాన్ని ఆలస్యంగా గుర్తించిన వాళ్ళూ - నా ఆఫీసరు ఉద్యోగాన్ని హోదాని గుర్తించినవాళ్ళూ - ఇలా కానీ ఎందుకు పెళ్ళి చేసుకోవాలి? అని మానేశాను"

"అదే నీ ప్రశ్నయితే జీవితంలో స్థిరపడటానికీ, జీవితానికి ఓ రూపు రేఖలు రావడానికి పెళ్ళిచేసుకోవాలి" అన్నాను.

ఏం పెళ్ళికానివారందరూ జీవితంలో స్థిరపడటంలేదా?'

స్థిరపడవచ్చు. కానీ అలాంటి జీవితం ఓ అసంపూర్ణ చిత్రమేమో. జీవితంలో కనపడాలంటే పెళ్ళిచేసుకోవాలి"

"ఏం పార్థూ నువ్వంతగా స్థిరపడలేదా? ఉండటానికో ఇల్లు, సంపాదన, బాంక్ బాలెన్స్ ఇవన్నీ స్థిరపడటం కాదా?"

తల అడ్డంగా ఊపాను.

"లేదు, విభావరీ నువ్వు చెప్పినవన్నీ మనిషికి కలిగిస్తాయి అంతే. నిజమైన జీవితానికి కావలసింది ఓ తోడు. నీ ఆనందాన్ని బాధను, మూడ్సును పంచుకునే తోడు. ఎలాంటి స్థితిలోనైనా నేను నీకున్నాను అనే ఓ లాలన - ఇవన్నీ ఒక్క పెళ్ళిద్వారానే సాధ్యపడతాయి."

నా వైపే చిత్రంగా చూసిందో క్షణం - "పెళ్ళంటే ఇంత గొప్ప అభిప్రాయం ఉన్నవ్వాడివి నువ్వెందుకు పెళ్ళిచేసుకోలేదు"

"చెప్పాగా తెలీదని. బహుశా ఇంకా ఆ సమయం రాలేదేమో" అన్నాను నవ్వేస్తూ.

ఆ మాటకి విభావరి నవ్వింది చిన్నగా. "ఏమో పార్థూ. నువ్వు చెబుతున్న ఆ జీవిత సంపూర్ణత్వం, అసంపూర్ణత్వం ఏమీటోగానీ ఆ తోడు నాకంతగా అవసరం అనిపించలేదెన్నడూ"

ఒక్కక్షణం విభావరి కళ్ళలోకి సూటిగా చూశాను. "విభావరీ నిజం చెప్పు. ఆత్మవంచన చేసుకోకుండా చెప్పు. గడచిన జీవితంలో ఏ క్షణంలో కూడా ఈ ఒంటరితనం భరించరానిదిగా అనిపించలేదా నీకు?"

తడబడ్డది విభావరి. అదీ ఒక్క క్షణం పాటే. జీవితంలో మొదటి సారి విభావరి తడబడగా నే చూడటం.

తెచ్చి పెట్టుకున్న నవ్వుతో అంది. - "ఒంటరి తనం ఏముంటుంది, పార్దు? పాప భవిష్యత్తు గురించిన ఆలోచనలలో ఒంటరితనమెక్కడిది?"

నాకు తెలిసిపోతూనే ఉంది విభావరి ఇబ్బంది పడుతోందని ఎందుకో రెట్టించాను. "పోనీ పాప భవిష్యత్తును తీర్చి దిద్దటానికి నీకు మరో తోడు పాపకి తండ్రి స్థానంలో ఓ వ్యక్తి - అవసరం లేదంటావా? నీకు జీవితంలో ఎదురైన ఓ చేదు అనుభవానికి ప్రతిగా నీ పాపకు సంపూర్ణ రక్షణ కరువయ్యేలా చెయ్యటం ఏం న్యాయం?"

విభావరి మౌనంగా వింటూ ఉండిపోయింది. ఆ మౌనం నన్ను మళ్ళీ మాట్లాడించింది. "ఏది ఏమైనా నువ్వు అభయకు అన్యాయం చేశావు.

చేస్తున్నావు. పాప జీవితంలో దొర్లిన ఈ అపశ్రుతి నిన్ను పరాజితగా నిలబెడుతుంది విభావరి" అన్నాను.

విభావరి చటుక్కున నా కళ్ళలోకి చూసి, "నా గతాన్ని విస్మరించి - అభయకు తండ్రి స్థానంలో ఉండే సంస్కారి దొరికేవాడంటావా పార్థూ?" అంది.

"ఏం, ఎందుకు దొరకరూ?"

"ఏదీ ఒక్కళ్ళని చూపించగలవా?" విభావరి కంఠం హేళనగా ధ్వనించింది.

ఆ హేళన నాకే సూటిగా తగిలినట్లనిపించింది.

"ఈ క్షణం. నీకు ఎలాంటి అభ్యంతరం లేకుంటే, ఈ క్షణమే నీ గతం, అంతరంగం తెలిసిన వాడిగా నిన్ను పెళ్ళిచేసుకోవడానికి నే సిద్ధమే విభావరీ" అన్నాను.

ఏదో ఆవేశంలో పడికొట్టుకు పోతున్నవాడిని వారిస్తున్నట్లుగా - "పార్థూ?" అంది విభావరి ఆందోళనగా.

అలా లిప్తపాటులో నా నోట నుంచి దొర్లిన మరుక్షణం అర్థమయింది నాకు తెలీకుండా ఆవేశానికి లోనై నేనేం మాట్లాడానో. చప్పున విభావరి వంక చూశాను.

అప్పటికే నా వంక చూస్తున్న తను చటుక్కున తల దింపుకుంది. ఒక లిప్తపాటు కలసిన చూపుల్లో తన మొహంలో భావాల్ని చదవలేకపోయాను. ఒక్కసారిగా నా ఆవేశానికి నాకే సిగ్గేసింది. మాట జారి తనని బాధపెట్టి ఉంటాను అన్న భావం వ్యాపించింది మనసంతా.

విభావరి వంచిన తల ఎత్తలేదు. మౌనంగా నడుస్తోంది. తనకి తాను సంభాళించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు కనిపించిందామె ముఖం.

అనవసరంగా మాట్లాడి ఇటువంటి ఇబ్బంది కలిగించే పరిస్థితి కల్పించుకున్నందుకు నామీద నాకే చిరాకేసింది. విభావరి ఇంటివరకూ వెళ్ళి కాఫీ తాగలేనేమో. ఈ నాటికి అనిపించింది.

"విభావరీ అర్జెంట్ పనుంది వెళ్ళాలి. మరోసారి కలుస్తాను" అన్నాను.

"అదేంటి ఇంతవరకూ వచ్చి, కాఫీ తాగి వెడువుగాను"

"లేదు మరోసారి అభయకు చెప్పు" అన్నాను వెళ్ళటానికి ఉద్యుక్తుడినవుతూ.

విభావరి కూడా బలవంతం పెట్టలేదు. "ఓకే సీ యూ" అంది.

ఆ రాత్రి పడుకున్నానే గానీ నిద్రపట్టలేదు. అనవసరంగా విభావరి మనసుని గాయపరచానేమో నన్న భావం మనసుని ఉండబట్టనీయలేదు.

మరునాడు విభావరిని కలిసి క్షమాపణ చెప్పాలని నిర్ణయించుకున్నాను.

అనుకున్నాక మనసు కాస్త కుదుట పడ్డట్టయింది.

ఎప్పటికో నిద్రపట్టింది.

●●●

స్టాఫ్ రూములో ఉన్న నన్ను "మే ఐ కమిన్ సార్?" అంటూ అడిగింది అభయ.

"రా అమ్మా" అన్నాను.

"అమ్మ మీకిమ్మంది" అంటూ ఒక కవరిచ్చి తిరిగి వెళ్ళిపోయింది.

కవరు విప్పాను.

**"పార్థా!**

'ఏ ఒక్క క్షణంలో కూడా ఈ ఒంటరితనం భరించరానిదిగా అనిపించలేదా నీకు అన్న నీ ప్రశ్న - ఎందుకో నాలో విపరీతమైన అలజడి కలిగించింది. బహుశా పదహారు సంవత్సరలుగా ఏనాడూ నన్ను నేను ప్రశ్నించుకోని ప్రశ్నయి ఉంటుందది. అమ్మ పోయాక బంధువులు వెలివేస్తే నా అన్నవాళ్ళు ఒక్కళ్ళూ లేక, కడుపులో పాపతో చదువుకోవడం కోసం నే పడ్డ కష్టాల్లో ఏనాడూ ఈ ప్రశ్న నే వేసుకోలేదు. నిరుద్యోగిగా పాప మందులకి కూడా డబ్బులేక అడుగుదామంటే అంతటి ఆప్తులు లేక నా రక్తం అమ్ముకుని ఆ డబ్బుతో మందులు కొనుక్కున్న ఆ రోజు కూడా నాకు మనసులో ఈ ప్రశ్న ఒక్క క్షణమూ మెదల్లేదు. ఒంటరిగా ఉద్యోగం చేసున్న ఆడది - అందులోనూ తండ్రెవరో తెలీని బిడ్డకు తల్లి - అనగానే ఏ క్షణమైనా జారకపోతుందా? అంటూ ఎదురుచూసే కుక్కలు గేలి చేస్తున్న క్షణాల్లో కూడా నిజం, పార్థా, నే నీ ప్రశ్న వేసుకోలేదు. ఎందుకో తెలుసా?

"నే ఒంటరిగా ఏనాడూ లేను. బ్రతకాలనే కోరిక. బ్రతకగలననే ధైర్యం, ఎందుకు బ్రతకలేననే మొండితనం - ఇవన్నీ ఎప్పుడూ నాలోనే ఉండేవి. ఆ తర్వాత అభయ చుట్టూనే ఊహించుకున్న ఊహలు, పెంచుకున్న ఆశలు వచ్చిచేరాయి. మరింక ఒంటరి తనం అన్న ప్రశ్న ఎక్కడిది? అనుక్షణం నే పెళ్ళి చేసుకోలేదు అన్న విషయన్నే చర్చనీయాంశంగా తీసుకునే నా చుట్టుపక్కల వాతావరణం ఒకే పట్టుదలను రేపింది. పార్థా ఒక మగవాడు ఒంటరిగా ఉండటానికి అంగీకరించే ఈ సమాజం ఓ ఆడదాన్ని ఒంటరిగా ఉండటానికి ఎందుకు అనుమతించదు? అందుకే ఎందుకు అనుమతించదనే - ఒంటరిగా ఉండటానికి నిర్ణయించుకున్నాను.

ఇదో పిచ్చి నిర్ణయంలా, మూర్ఖపు ప్రతినలా కనిపించవచ్చు. పార్థూ! కానీ ఈ ప్రతిన నా ఒక్కదానిది కాదు. ఒక స్త్రీ తన జాతి తరఫున పూనిన ఒక సంకల్పం, ఫలితం - ఎన్నో చేదు అనుభవాలు, ముక్కలైన నా మనసు, భయపెట్టిన నా భవిష్యత్తు అయినా భరించాను. ఒంటరిగానె జీవించాను. జీవించాలనుకున్నాను.

"కానీ నిన్న నువ్వన్నావ్ చూడు, పార్థూ అభయ జీవితంలో దొర్లిన అపశ్రుతి నన్ను పరాజితగా నిలబెడుతుందని - ఆ మాట నన్నొక్క క్షణం నిజమా అని ఆలోచింపచేసింది. నన్ను నన్నుగా గౌరవించే నువ్వు నన్ను మనస్ఫూర్తిగా స్వీకరిస్తానన్నావ్. లిప్తకాలం పాటు వివశనయ్యాననుకుంటాను. సరే అందామనుకున్నాను. కానీ, పార్థూ, మరుక్షణం స్ఫురించింది. అభయకు నేనేం చెప్పబోతున్నానో.

"అభయ నా పేగు తెంచుకునే కాదు పార్థూ, నా మనసూ పంచుకుని పుట్టింది. ఎన్నో నిద్రలేని రాత్రులలో తన చిన్ని చేతులతో నన్ను లాలించి నిద్రపుచ్చేది. నిజానికి నా జీవితంలో ఎన్నో కష్టాలని పంచుకుంది తనే. అలాంటిది నే నీ నాడు నేనో తోడు కావాలని ప్రలోభపడితే అభయ ఎలా అర్థం చేసుకుంటుంది? స్త్రీని గౌరవించలేని సమాజంపై పోరాడటానికి సిద్ధపడిన అమ్మ స్త్రీగా ఓడిపోయిందనుకుంటే? చివరికి ఏ ఆడదయినా ఇలానే ఓడిపోవాల్సిందేనన్నమాట అని భావిస్తే?

"నా జీవితం అభయకు ఓ పిరికిమందు కాకూడదు. అలా కాకూడదనే నీ ఆఫర్ స్వీకరించలేకపోతున్నాను. ఎందుకో నాకో గొప్ప నమ్మకం పార్థూ అభయ నన్నేనాడూ ఈ విషయంలో అపార్థం చేసుకోదు. నన్ను పరాజితగా మిగల్చదు. నీలోని మంచితనానికి, మానవతకి థాంక్స్ మాత్రమే చెప్పగలుగుతున్నాను.

క్షమించు.

**విభావరి"**

లేదు, విభావరీ, నువ్వెన్నటికీ పరాజితవు కాదు. నువ్వు ఎప్పటికీ అపరాజితవే.

నాకు తెలీకుండానే నా కళ్ళు చెమర్చాయి. కనురెప్పల మాటు నుంచి ఉబుకుతున్న కన్నీటిని ఎందుకో ఆపలేకపోయాను.

*(ఆంధ్రప్రభ వారపత్రిక నుంచీ పునర్ముద్రితం)*

●●●

Click here to share your comments on this story